
# అనుభూతి

కె. వాసవదత్త రమణ

'రేణుకా! నీకు ఆడపిల్ల పుట్టిందే రబ్బరు బంతిలా ఉంది!'' మామ్మ నన్ను చూపిస్తూ పొంగిపోతూ అంది అమ్మతో.

అమ్మ ఆనందంగా నవ్వింది. నేను పెరిగి పెద్దవుతుండగానే మా మామ్మ గుండెపోటుతో చనిపోయింది. ఆవిడకి నేనంటే ఎంత ప్రేమో, నేను పుట్టగానే ఆవిదెంత పొంగిపోయిందో. నన్ను కాలు కింద పెట్టనివ్వకుండా ఎంత అపురూపంగా చూసుకుందో మా అమ్మ నాకు పదే పదే చెబుతుండేది. నాకు లీలగా జ్ఞాపకం మెదిలేది కాని మా మామ్మ, ఆమె ప్రేమ నా ఆలోచనలో స్పష్టంగా కనపడేది కాదు. నాకు ఎటువంటి అనుభూతి కలిగేది కాదు.



అలా అని మా అమ్మ, మా నాన్న, మా తమ్ముడు అందరూ ఎంతో దగ్గరగా ఉన్నా కూడా నేను ఆ ప్రేమల్ని ఆ అభిమానాల్ని తృప్తిగా అనుభవించలేకపోయేదాన్ని. ఎందుకో నాకే తెలియలేదు. బహుశ దేముడు నన్నిలా స్పందన లేకుండా పుట్టించాడేమో అనుకునేదాన్ని.

"ఎన్ని పెట్టు, ఎన్ని కొను'' అలాగే రబ్బరు బొమ్మలా చూస్తుంది కాని బావుందని కాని, లేదని కాని ఒక్కమాట కూడా అనదు''. అమ్మ తరచు నన్ను విసుక్కుంటూ అనేది. నాన్న

ఎప్పుడూ ఏమి అనేవాడు కాదు. అమ్మ చెప్పిందే వేదంలా చేసుకుంటూ వెళ్ళేవాడు. అదే ఆయనకు ముందు నుంచి అలవాటు. నాకే ఎందుకో మన స్సుకి ఏ అనుభూతి పట్టినట్టుగా ఉండేది కాదు.

అలాగని కోపం, విసుగు వచ్చేవి కావు. ఎంతో బాగానే ఉందనిపించేది. మరుక్షణంలో ఏదీ బాగా లేదనిపించేది. ఎంటో సంతృప్తిగా మటుకు ఉండేది కాదు. అలాగని నాకేం అసంతృప్తి లేదు.

నా టెన్తులో అనుకుంటా, పక్కింటి రాజుగాడు సైకిల్ మీద హడావుడిగా వచ్చి, నా చేతిలో ఓ కాగితం దూర్చి గబగబా వెళ్ళిపోయాడు. ఏమిటా అని చూస్తే అదో ప్రేమలేఖ. నన్ను వర్ణిస్తూ, నా అందాన్ని పొగుడుతూ, నన్ను వదిలి ఉండలేని దిగులును చూపెడుతూ సాగిందా ఉత్తరం. మర్నాడు జవాబుకోసం ఆశగా వచ్చిన వాడి ముందే వాడి ఉత్తరం ఇంటి ముందు తూములోకి విసిరేసాను. ఎంతో బాధగా వెళ్ళిపోయాడు. నా కేసి వెనక్కి వెనక్కి తిరిగి చూస్తూ నాకేం బాధ, కోపం రెండు అనిపించలేదు కాని కొంచెం వాడి మీద జాలేసిందేమో అనిపించింది. అది తాత్కాలి కమే! ఆ విషయాన్ని మళ్ళీ నేనెప్పుడు గుర్తుచేసుకో లేదు. నన్నేం పెద్దగా కదిలించనూ లేదు.

***

డిగ్రీ చదువుతున్నప్పుడు మటుకు మా అత్తయ్య కొడుకు, వాడి పేరు బుజ్జి, నా మీద కొంచెం ఎక్కువగా ఇష్టం చూపెడుతున్నట్టు అని పించేది. మా అత్తయ్య నా వంక మురిపెంగా చూస్తూ మా అమ్మతో కబుర్లు, మా నాన్నతో మంత నాలు జరుపుతుండేది మా ఇంటికి వచ్చినప్పుడ ల్లా.

నిజానికి బుజ్జి బావ బావుండేవాడు, తెల్లగా, సన్నగా పొడవుగా, ఉండేవాడు. అసలు చూడగానే 'అందగాడు' అనిపించేవాడు. అప్పట్లో మా ఇళ్ళలో పి.జి చేసిన వాళ్ళు కూడా ఎవ్వరు లేరు, మా బావ తప్ప. ఆ గొప్ప మటుకు అతని కళ్ళల్లో అప్పుడప్పుడు కొంచెం కనపడేది. ఏమయినా వాడు పూర్తిగా అమ్మ కూచి. అత్తయ్య మాట జవ దాటేవాడు కాదు.

***

ఓ రాత్రి అమ్మా, నాన్న పెళ్ళికి వెళ్ళారు. నేను ఇంటరు పరీక్షలకు చదువుకుంటుంటే బావ వచ్చి ఎదురుగా కూర్చీలో కూర్చున్నాడు. "అంజలీ నేనొ క్కమాట అడగనా" అన్నాడు తడబాటుగా.

"చెప్పు బుజ్జీ" అన్నాను.

"అంజలీ నేను నిన్ను ప్రేమిస్తున్నాను నువ్వంటే నాకు ప్రాణం. మరి నీకు నేనంటే ఇష్ట మేనా. నన్ను పెళ్ళి చేసుకుంటావా?" చిన్నపిల్లా డిలా గబ గబా అన్నాడు.

అతనన్న మాటలు విన్నా కూడా నాలో ఏ భావం కలగలేదు. అతని వంక తదేకంగా చూసి "బుజ్జీ నువ్వంటే నాకేం చెడ్డ అభిప్రాయం లేదు కాని నిన్ను పెళ్ళి చేసుకోవాలంటే మటుకు నేను కొంచెం ఆలోచించుకోవాలి? అమ్మ, నాన్నను కూడా సంప్ర దించాలి" అన్నాను నెమ్మదిగా.

అతను కొంచెం హర్టు అయినట్టు అని పించింది.

"అంజలి నిజం చెప్పు? నువ్వు నన్ను ప్రేమించడం లేదూ?" ఆవేదనగా అన్నాడు.

"లేదు బుజ్జి నాకు అటువంటి భావన ఏం కల గటం లేదు?" నిజాయితీగానే అన్నాను కాని అతను మటుకు నన్ను నమ్మలేనట్టుగా చూసాడు.

బహుశ నాకంటే అందగాడు, చదువుకున్న వాడు, ఇంత ప్రేమను మనసులో నింపుకున్నవాడు అంజలికి ఇంకెవరన్నా దొరుకుతాడా అని అనుకొని ఉండవచ్చేమో అప్పుడు.

ఏదయితేనేం మా అత్తయ్య పట్టుపట్టి మా అమ్మా, నాన్నలను ఒప్పించి, చివరికి మమ్మల్ని తాంబూలాల వరకు లాక్కువచ్చింది. అమ్మకి మటుకు వాళ్ళు కొంచెం విశాలమైన మనస్సు కల వాళ్ళు కాదని మా అత్తయ్యంటే కొంచెం అయిష్టత ఉన్నట్టు ముందు గట్టిగానే ప్రతిఘటించింది. కాని నాన్న అత్తయ్యను ఈ ఒక్క విషయంలో గట్టిగా సపోర్టు చేయడంలో అతడు ఒప్పుకోక తప్పలేదు. చివరికి అయిష్టంగా ఓటు వేసింది, సరేనంటూ.

ఇద్దరు కలిసి నన్ను అడిగినా నేనెటూ జవాబు చెప్పలేకపోయాను. "బుజ్జి బాగానే ఉంటాడు కాని అప్పుడే పెళ్ళి" తేల్చుకోలేకపోయాను తొందరగా కాని ఈలోపే ఈ వ్యవహారం ఓ చిత్రమైన మలుపు తిరిగింది.

***

మా పిన్ని కూతురు స్వరూప అందంగా ఉండకపో యినా ఆకర్షణీయంగా ఉండేది. మాట్లాడు తుంటే పెదవి విరు పులు, నడుము ఊపులు, చేతుల సవ రింపులు, గాజుల గల గలలు ఏమిటో వాతా వరణం అంతా ఆహ్లా దంగా ఉంచేది. నిజా నికి దేముడు దానికి చాలా అన్యాయం చేసాడు. స్వరూపకు చిన్నప్పుడే పోలియో వచ్చింది. మా బాబా యి మా బంధువు లందరిలో బాగా డబ్బున్నవాడు. కాంట్రాక్టులు అవీ చేసి చాలా సంపా దించాడు. మా చిన్నతనంలో మా నాన్న ఉద్యోగంలో జాగ్రత్తగా గుట్టుగా సంసారం నడిపితే, మా బాబాయి మటుకు చాలా దర్జాగా జీవితం గడిపాడు. మా అత్తయ్యలందరిని కూడా చాలా బాగా ఆదరించేవాడు. ఎన్ని చేసినా మాకు మటుకు మా పిన్నంటేనే చాలా ఇష్టం. మన స్సులో ఏం బేషజం లేకుండా అందర్నీ సమానంగా ఆదరంగా చూసేది.

ఇంతకీ ఇదంతా ఎందుకంటే అనుకోకుండా మా బుజ్జి బావ పెళ్ళి కాస్తా స్వరూపతో హడావు డిగా చాలా గ్రాండ్‌గా జరిగిపోయింది. మా అమ్మ ముఖంలో కత్తివేటుకు నెత్తురుచుక్క లేదు. నాకు ఏం బాధగా అనిపించలేదు. సరికదా స్వరూప పెళ్ళి అయినందుకు కొంచెం ఆనందంగానే అని పించింది. ఎందుకంటే ఈ రోజుల్లో అన్నీ బావుంటేనే ఆడపిల్ల పెళ్ళి అవ్వడం కష్టం అంటారు. మరి పాపం స్వరూపకి పోలియో, అయినా మా బుజ్జి బావ చేసుకున్నాడంటే చాలా మంచే జరిగినట్టనిపించింది. పెళ్ళిలో నేను చాలా సందడిగా తిరిగాను మా నాన్న మటుకు బోలెడు బాధపడిపోయాడు.

ఆ తర్వాత ఎప్పుడో నాకు అర్థమైంది. మా నాన్న ఇచ్చే రెండున్నర లక్షల కట్నం మా అత్త య్యకి, ముఖ్యంగా మా బావకి కూడా నచ్చలేదని, మా బాబాయి ఇచ్చిన అయిదులక్షలు, ఇల్లు మటుకు తెగ నచ్చేసాయని అందుకే స్వరూప ప్రపంచ సుందరిగా వాళ్ళ కళ్ళకి కనపడిందని.


(KIP) KUTBI
INDUSTRIAL PRODUCTS
4-4-109, Lala Temple Street, Behind
Vimal Plaza, Pan Bazar, Rani Gunj,
Secunderabad-3.
Cell : 9440324598, Ph: 27712566
Dealers & Suppliers of Tralley wheel,
Rubber & Hydralic Hose, MS & SS Pipe &
Pipe Fittings 'V' Belt, Timing Belt
All Types of Bearing AND
General Machinary Supplier



# గుణసుందరి అసలు పేరు




**జూ**నియర్ శ్రీరంజని అసలు పేరు మహాలక్ష్మి. ఆవిడ పేరును అలా మార్చుకోమని సలహా ఇచ్చింది విజయవాడ మారుతీ టాకీస్ అధినేత పోతిన శ్రీనివాసరావు. దర్శక నిర్మాత డూండీ తండ్రి. చిత్రపు నారాయణమూర్తి దర్శకత్వంలో వచ్చిన భీష్మ సినిమా ఆవిడ తొలిచిత్రం. గుణసుందరికథ సినిమాతో ఆవిడ బాగా పాప్యులర్ అయ్యింది. 1964నుంచి అనారోగ్య కారణంగా నాలుగేళ్లు సినిమాలకు దూరంగా వుంది. ఆ తరువాత ఆవిడ నటించిన చిత్రం తమిళంలో వచ్చిన 'నాన్' అనే సినిమా. అదే తెలుగులో 'నేనంటే నేనే'గా వచ్చింది. తెలుగులోనూ తనవేషం ఆవిడే వేసింది.

ఏదైతేనేం స్వరూప పెళ్ళి అయ్యింది. తర్వాత నా డిగ్రీ కూడా పూర్తి అయ్యింది.

***

నా పెళ్ళి గురించి మా అమ్మ పడ్డ మూడేళ్ళ తాపత్రయం. శరత్ రూపంలో నాకు ఎదురు వచ్చింది.




"బ్యాంకులో ఉద్యోగం. కట్నం ఎక్కువగా అడగలేదు నీకు నచ్చాడుటే" అమ్మ ఆఖర్న అడిగింది. పెళ్ళివారు నచ్చారని చెప్పాక. నా దగ్గర జవాబు లేదు. మనిషి నచ్చడం ఏమిటి? అస్సలు ప్రేమంటే ఏమిటి? పెళ్ళంటే ఏమిటి? ఇప్పుడు అమ్మా, నాన్నలను వదిలి అతన్ని పట్టుకుని వెళ్ళిపోవడమేనా పెళ్ళంటే? నాకంతా అయోమయంగా ఏమి లేదు కాని జరుగుతున్నది మటుకు అర్థం కావడం లేదు.

కొంచెం మనస్సంతా గందరగోళంగా ఉంది.

"ఇదెప్పుడూ పిచ్చి మొద్దే" దాని గురించి ఎప్పుడు ఆలోచించుకోదు. ఎంతసేపు పక్కవాళ్ళ పెళ్ళిళ్ళు చూసి సంతోషం పడటమో, నాన్నకి ప్రమోషన్ వస్తే సంబరపడటమో, తమ్ముడికి ఉద్యోగం వస్తే పొంగిపోవడమో ఇలా తప్పితే దాని జీవితం గురించి దానికే ఆలోచన లేదు?" తొలిసారిగా నాన్న ప్రేమగా నన్ను దగ్గరకు తీసుకుంటూ నా తల నిమురుతూ నా గురించి తన అభిప్రాయాన్ని బయట పెట్టాడు.

నేను వాళ్ళు చెప్పింది వింటూ నన్ను అర్థం చేసుకునేలోపే నా పెళ్ళి శరత్‌తో జరిగిపోయింది. అతను నా మెడలో తాళి కడుతూ ఉంటే నా కళ్ళల్లో ఏ భావము కలగలేదు. జరిగే తంతు అలాగే చూస్తూ ఉన్నాను. అతను రెండు మూడు సార్లు నా వంక చూస్తూ చిలిపిగా నవ్వాడు. బదులుగా నేను కూడా చక్కగానే నవ్వాను కాని అది ప్రేమ కాదు అని ఎలా అతనికి తెలిసేది?

నాలో ప్రేమ లేదని, తృప్తి కూడా లేదని కేవలం అందరితోపాటు నేనూ ప్రపంచ ప్రవాహంలో నడిచే రబ్బరు బొమ్మనని అతనికి ఎలా తెలుస్తుంది?

పెళ్ళి కాగానే ఊటీకి హనీమూన్‌కి వెళ్ళాం. శరత్ చెయ్యి పట్టుకుని పార్కులు వెంబడి, పచ్చటి మైదానాలు వెంబడి నడుస్తూంటే అప్పుడు నా కర్థమైంది. నేను ప్రకృతిలో భాగాన్ని కాని సమాజంలో భాగాన్ని కాను అని, స్వచ్ఛతకు దాసోహం అని.

అతను తన కాలేజీ కబుర్లు, ఇంటి విషయాలు చాలా చెప్పాడు. నేను చాలా చెప్పాను అతనికి ఎంతో ఉత్సాహంగా. ఆ పచ్చటి ప్రకృతిలో కలిసిపోయి నేను అతనిలో ఐక్యమయ్యాను.

***

"ఎలా ఉందే సంసారం" స్నేహితురాలు రాగిణి అడిగింది.

"ఏమో?" అన్నాను.

"చాల్లే వేషాలు. నీ ముఖమే చెబుతోంది. ఎంత కళకళలాడిపోతోందో నువ్వు చాలా తృప్తిగా ఉన్నావని" నవ్వింది రాగిణి.

నేనా తృప్తిగా ఉన్నానా! నాలో నిజమైన సంతోషం ఉందా? నేను నిజంగా శరత్‌ని ప్రేమించి అతనికి అంకితమవ్వగలనా? ఏమో, నాకేమంత సంతృప్తికరమైన సమాధానం లభించలేదు?

***

"అంజలి" నీకా పేరు ఎందుకు పెట్టారు?"

శరత్ పడుకున్నప్పుడు ఎందుకో హఠాత్తుగా అడిగాడు.

''మా నాన్నకి అంజలీదేవి ఫేవరేట్ హీరోయిన్'' అన్నాను.

''మా నాన్నకి శరత్ నవలలంటే చాలా ఇష్టం. అందుకే నాకా పేరు పెట్టారు'' అన్నాడు నన్ను దగ్గరకు తీసుకుంటూ.

మనకనిపించింది మన కిష్టమైంది మన దగ్గర వాళ్ళకి ఆపాదిస్తాము. మనకు నచ్చింది ఇవతలి వాళ్ళకి నచ్చేవరకు ఒప్పిస్తాము. మనం వండింది ఇవతలి వాళ్ళు అద్భుతం అని అనిపించేటట్టు ప్రయత్నిస్తున్నాము. మనం 'ది బెస్ట్' అనిపించుకోవటం కోసం జీవితాంతం కష్టపడతాము. ''ఇందులో మనసుకు తృప్తి ఎంత వరకు కలుగుతుంది? అనుభూతుల పుష్పగుచ్ఛాల్ని మనం జీవితంలో ఎన్ని ఆఘ్రాణించగలుగుతున్నాం?'' మనం పుట్టింది అనుభూతుల మాలలు అల్లుకోవడం కోసం కాదా, కేవలం తల్లినో, తండ్రినో, భర్తనో, భార్యనో, పిల్లల్నో, ఉద్యోగం చూసో ఇలా అందరిని నచ్చినట్టు, మెచ్చినట్టు, వాళ్ళ నోట్లో మన పేరు చచ్చేవరకు నానేటట్టు, చివరి శ్వాస వరకు ఇలా బతకవలసిందేనా? ఇదేనా జీవితం అంటే.

అంతే అయి ఉంటుంది, ఎందుకంటే నేను అలాగే నడుపుతున్నానుగా బతుకుబండిని.

నాకు ముందు పాప తర్వాత బాబు పుట్టాడు. పిల్లలు పుట్టినప్పుడు మాతృత్వపు మధురిమ అంటారే అదయినా నన్ను ముంచెత్తుతుందేమోనని అనుకున్నాను. అప్పటికి ఇలాంటి అర్థంలేని ఆలోచనలు కాకుండా నేను సమాజంలో సహజంగా కలిసిపోగలనని ఎంతో భ్రమపడ్డాను.

కాని ఆపరేషన్ నొప్పులకు తట్టుకోలేక ఏడవడమే సరిపోయింది. పుట్టిన చిన్న పాపకు పాల కోసం స్థనాన్ని ఇవ్వడం ప్రాణసంకటంగా కనిపించింది. జ్వరం, ఒళ్ళునెప్పులు, కుట్లు బాధలు, ప్రసవం అమ్మో నరకం అనిపించేలా చేసాయి.

శరత్ మటుకు ''అంజలి నా మూలంగానే నీకీ కష్టాలు'' అంటూ ఎంత బాధపడిపోయాడు. పాపను దాదాపు అతనే ప్రాణంగా పెంచుకున్నాడు.

బాబు మటుకు అమ్మ కూచే. నన్ను వదిలేవాడు కాదు. కాని క్రమంగా పెద్దయేటప్పటికి వాడి లోకం వాడూ ఏర్పరుచుకున్నాడు.

టైంకి అన్నం పెట్టేయడం, వాళ్ళ ఆరోగ్యం, ప్రవర్తన అన్ని నేనే చూసుకోనేదాన్ని వాళ్ళని పొద్దునే లేపడం, క్రమశిక్షణగా పెంచడం, చదువు అని శరత్ చూసుకునేవాడు. ఇలా పిల్లల్ని పంచుకోవడంలో వాళ్ళ అనుబంధాల్ని పెంచుకోవడంలో వాళ్ళ భవిష్యత్తును అద్భుతంగా తీర్చిదిద్దుకోవాలనుకోవడంలో మేం మా భార్యాభర్తల అనుబంధాల్ని పలుచన చేసుకున్నామేమో అనిపించేది ఒక్కోసారి. ''మళ్ళీ నాలో అంతగా ప్రేమించే గుణం, స్పందించే లక్షణాలు లేవుగా మరి ఎందుకు ఆలోచన'' అని మనస్సు ప్రశ్నించేది.

''నిజమే కాని నేను మారవచ్చుగా? నాలో అంతరాంతరాళల్లో ఉబికే నిజమైన ప్రేమ ఉంటే అది ఎప్పటికయినా బయట పడుతుందేమో? నాకు జీవితంలో ఎప్పటికైయినా సంతృప్తి దొరుకుతుందేమో? నిజమైన ఆనందాన్ని నేను అనుభవిస్తానేమో అని సమాధానపరచుకునేదాన్ని.

***

ఆ రోజు రానే వచ్చింది. నేను పుట్టినందుకు సార్థకత లభించే రోజు త్వరలోనే నా జీవితంలోకి వచ్చింది. పిల్లలిద్దరు పెళ్ళిళ్ళయి అమెరికా వెళ్ళిపోయాక నేను శరత్ సాయంతో ''చేతన'' అనే సంస్థను ప్రారంభించాను.

''ఎక్కడెక్కడున్న వీధి బాలల్ని తీసుకువచ్చి వాళ్ళకు చదువు, విజ్ఞానం ఇచ్చి వాళ్ళని వాళ్ళ కాళ్ళ మీద నిలబడేలా చేయడమే నా సంస్థ ధ్యేయం.'' మాసిపోయి, మురికిగా ఉన్న అడుక్కునే పిల్లలు, చెత్త ఏరుకునే పిల్లలు, ఇళ్ళల్లో చిన్న చిన్న పనులు చేసే పిల్లలు అందర్ని ఏరి ఏరి తీసుకు వచ్చి వాళ్ళని ఆణిముత్యాలుగా తయారు చేస్తూంటే నాలో ఉబికే అవ్యక్తమైన అనుభూతికి కొలతే లేదు.

మా బాబాయి ఎంతో మానవత్వంతో బోలెడు డబ్బు విరాళాలుగా ఇవ్వడమే కాకుండా అందరి దగ్గర్నుంచి చాలా ఇప్పించాడు. మా పిల్లలు తమ జీతాల్లోంచి నెలవారిగా మా సంస్థకి సహాయపడటమే కాకుండా తమ ఫ్రెండ్స్, చుట్టుపక్కల భారతీయుల నుంచి ఎన్నో నిధులు సేకరించి అక్కడ్నుంచి పంపుతూనే ఉన్నారు.

''పిల్లలు గుప్పెడన్నం సంతృప్తిగా తింటూ, చదువుల్లో, ఆటపాటల్లో మేటిగా అవుతుంటే ఈ జన్మకింతకన్నా ఏం కావాలి?'' అనిపించేది.

మనస్సంతా ఉద్వేగంతో, సంతృప్తిగా నిండిపోయేది ''ఇదే కాదు నాకు దక్కాల్సిందింకా ఉంది'' అన్నట్టు మా పాప అమెరికా నుంచి మా మనవడు ఋషిని నాకిచ్చి ''అమ్మా వాడు నీ నీడన పెరిగితేనే పదిమందికి నీడ నిచ్చే వృక్షమవుతాడు. ఇక్కడ పెరిగాడంటే ఏమైపోతాడన్న భయంతో నీకు అప్పచెప్పుతున్నాను. తల్లిగా వాడ్ని నేను మిస్ అయినా, నేను నా వృత్తిలో మరుపును తెచ్చుకోగలను, కాని వాడు నన్ను మిస్ అయితే ప్రేమల్ని, అభిమానాల్ని కోల్పోయి మన మూలాల్ని మరిచిపోయి మర మనిషైపోతాడన్న స్వార్థంతోనే నీ దగ్గరవదిలేస్తున్నాను.''

ఇంతకంటే అద్భుతమైన కానుక ఏ అమ్మమ్మకయినా ఇంకా ఏం ఉంటుంది. ఋషి అని పిలవగానే వాడు అమ్మమ్మ అంటూ నా గుండెలో దూరి నన్ను హత్తుకుపోతుంటే అనిర్వచనీయమైన ఆనందం నన్ను సముద్రంలా ముంచేస్తోంది. పర్వతంలా నన్ను ఎంతో ఎత్తుకు తీసుకుపోతోంది. ఎవ్వరూ అధిగమించలేని సంతృప్తిలో.

***

''అమ్మా ఋషి స్పూన్‌తో తింటంలేదు. అన్నం తింటూ కిందపడేస్తున్నాడు'' ఫిర్యాదుగా అంది టీచరు లంచ్‌రూమ్‌లో.

''రాజ్యంగారూ వాడిని చేతులతోనే తిననీయండి. వాడికెలా కావాలంటే అలా ఉండనివ్వండి'' అన్నాను నేను.

''అమ్మమ్మా! థ్యాంక్ యూ! నేను కింద పోయకుండా తింటాగా!'' అన్నాడు నన్ను చుట్టుకుపోయి వాడు ముద్దుగా! ''నువ్విచ్చిన స్వాతంత్ర్యాన్ని నేను దుర్వినియోగం చేయను'' అన్నట్టు ముత్యాల నవ్వులు నవ్వుతూ. నాకు ఎందుకో చనిపోయిన మా మామ్మ గుర్తుకు వచ్చింది. ఆమె ప్రేమంతా నా మనస్సును కమ్ముకున్న అనుభూతి కలిగింది.

★

